హామీలు అమలు చేయాలి

డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న రైతులు

- బీర్‌పూర్‌లో రైతుల ధర్నా
- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువని మండిపాటు

సారంగాపూర్(జగిత్యాల), మార్చి 20: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీర్‌పూర్ మండల కేంద్రంలో గురువారం రైతులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువు అని మండిపడ్డారు. 15 నెలల కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పంట రుణమాఫీ, రైతు బంధు, రైతు చనిపోతే రూ.5 లక్షల బీమా డబ్బులు అందేవని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల బాగోగులు చూడడం లేదని, గత 15 నెలల్లో 450 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. దేశానికి పట్టెడన్నం పెట్టే రైతన్న బాగోగులను కాంగ్రెస్ ప్రభుత్వం చూడడం లేదని మండిపడ్డారు. సారంగాపూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునీకరణ కోసం గత ప్రభుత్వం రూ.130 కోట్లకు పైగా ఖర్చు పెట్టిందని, ప్రాజెక్టు పూర్తయిన తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నీళ్లు బయటకు పోకుండా షెటర్లు పెట్టకపోవడంతో ఆయకట్టు చివరికి నీళ్లు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వలేదని, చనిపోయిన రైతులకు రూ.5 లక్షల బీమా అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా చేస్తున్న సమయంలో వేరే గ్రామానికి వెళ్తున్న ఓ వృద్ధురాలు బస్సు దిగి రైతులకు మద్దతుగా ధర్నాలో కూర్చుంది. ఊరు ఏలే రాజు మంచోడైతే, ఊరు మంచిదవుతుందని అంటూ సీఎం రేవంత్, కాంగ్రెస్‌పై వృద్ధురాలు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మెరుగు రాజేశం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నేరేళ్ల సుమన్, ప్రధాన కార్యదర్శి కిషన్, మాజీ సర్పంచులు లింగన్న, రవీందర్, నాయకులు గడ్డమీది రామచంద్రం, కొమురెల్లి, శ్రీనివాస్, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు. అలాగే, రైతు భరోసా ఇవ్వకపోవడంతో పెట్టుబడి కోసం ఇబ్బందులు పడుతున్నామని రైతులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. డిమాండ్లతో కూడిన ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

'విజయవంతం చేయాలి'

కొడిమ్యాల, మార్చి 20: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కొండ సత్యలక్ష్మి గార్డెన్‌లో ఈనెల 23న ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఆయన మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ, సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని తెలిపారు. మండలంలోని బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పులి వెంకటేశంగౌడ్, మండలంలోని బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్

రాయికల్, మార్చి 20: కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎల్లవేళలా అండగా ఉంటుందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్‌లో గురువారం గ్రామ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కార్యకర్తలంతా సమన్వయంతో పని చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బర్కం మల్లేశ్, తురగ శ్రీధర్ రెడ్డి, కొండపల్కుల రత్నాకర్ రావు, ప్యాక్స్ చైర్మన్ రాజలింగం యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్లు ఎలగందుల ఉదయశ్రీ, మారంపెల్లి రాణిసాయికుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలు స్పందన సాగర్‌రావు, నాయకులు గంగారాం, శంకర్ నాయక్, దుబ్బారెడ్డి, రాజేశం, వెంకటేశ్ పాల్గొన్నారు. అలాగే, రాయికల్ మండలం అల్లీపూర్, దావన్‌పల్లి, చింతలూర్ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబసభ్యులను జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పరామర్శించారు.

నినాదాలు చేస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ నాయకులు

రుణమాఫీపై బహిరంగ చర్చకు సిద్ధం

మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ నాయకులు

- ఎమ్మెల్యే సంజయ్‌ని విమర్శించే స్థాయి కృష్ణారావుకు లేదు
- మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

మల్లాపూర్, మార్చి 20: అసెంబ్లీ సాక్షిగా సీఎం, మంత్రులు పూర్తి స్థాయిలో పంట రుణమాఫీ చేశామని అబద్ధాలు చెప్పి రైతులను మోసం చేస్తున్నారని, రుణమాఫీపై మండలంలో ఎక్కడైనా తాము బహిరంగ చర్చకు సిద్ధమని మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సవాల్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని మొగిలిపేట గ్రామంలో సుమారు 300కుపైగా రైతులకు ఇప్పటికీ రుణమాఫీ కాలేదన్నారు. మాజీ సర్పంచ్ నాగరాజు ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి రైతుల నుంచి దరఖాస్తులు తీసుకొని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసేందుకు వెళ్తుండగా ఆయనను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారన్నారు. ఈ అంశంపై కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల అసెంబ్లీలో ప్రస్తావించగా, ఆయనపై కాంగ్రెస్ నేత జువ్వాడి కృష్ణారావు ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే సంజయ్‌ని విమర్శించే స్థాయి కృష్ణారావుకు లేదన్నారు. ఇప్పటికే కృష్ణారావు కుటుంబ సభ్యులను కోరుట్ల నియోజకవర్గ ప్రజలు నాలుగు పర్యాయాలు ఓడగొట్టారని గుర్తు చేశారు. ఎమ్మెల్యేపై మరోసారి విమర్శలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, సింగిల్‌విండో చైర్మన్ వేంపేట నర్సారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, నాయకులు ముద్దం శరత్‌గౌడ్, వనతడపుల నాగరాజు, బండి లింగస్వామిగౌడ్, డబ్బ రమేశ్, కోడూరి భిక్షపతి, చిట్టెడి రమేశ్‌రెడ్డి, పెద్దిరెడ్డి లక్ష్మణ్, తోట్ల భూమన్న, అల్లెపు నరేశ్, ఉయ్యాల లక్ష్మణ్, మాట్ల గంగాధర్, నోముల రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

'వికసిత్ భారత్'లో రసాభాస

- అదనపు కలెక్టర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే సీరియస్

జగిత్యాల, మార్చి 20: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం జరిగిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం రసాభాసగా సాగింది. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత పాల్గొనగా, ముందుగా అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడుతూ, ఢిల్లీలో రాజకీయం ఎలా మారిందో, తెలంగాణ రాష్ట్రంలోనూ రాజకీయాలు భ్రష్టుపట్టాయని, స్వార్థపర రాజకీయాలు, మూర్ఖపు ఆలోచనల వల్ల రాజకీయాలు ఇలా మారాయని, విద్యార్థులు ఇవన్నీ పట్టించుకోకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. దేశంలో రాజకీయాలు చెడిపోయాయని, చదువుకున్న యువత రాజకీయాల్లోకి అడుగు పెడితే రాజకీయాలు మారిపోవచ్చని తెలిపారు. ఈ విషయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, అధికారులు ఎంత స్వార్థంగా మారారో మాకు తెలువదా?, విద్యార్థులకు సంబంధించిన సమావేశంలో రాజకీయాలపై అధికారులు ఇలా మాట్లాడడం సరికాదని, లంచాలకు మరిగిన అధికారుల గురించి మాకు తెలియదా? అని పేర్కొన్నారు.

అసెంబ్లీ ముట్టడికి రైతులు తరలిరావాలి

మేడిపల్లి, మార్చి 20: రైతుల సమస్యలు పరిష్కారం కోసం ఈ నెల 24న చేపట్టే అసెంబ్లీ ముట్టడికి అన్నదాతలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి పిలుపునిచ్చారు. మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామంలో గురువారం ఆయన రైతులతో సమావేశమై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు ఐక్య వేదిక జిల్లా నాయకులు బందెల మల్లన్న, నేరెళ్ల శ్రీనివాస్, కాటిపల్లి దశరథరెడ్డి, సురకంటి హన్మంతరెడ్డి, కోనపురపు వెంకటేశ్, సురకంటి అంజిరెడ్డి, సురకంటి గంగారెడ్డి, ఎస్ఎన్‌రెడ్డి, రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల, మార్చి 20: రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 24న నిర్వహించే అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం ఆయన ఆయా గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నల్ల రమేశ్ మాట్లాడుతూ, రైతులందరికీ పంట రుణమాఫీ చేయాలని, సన్న వడ్లకు బోనస్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మల్లయ్య, నేరెళ్ల భూంరెడ్డి, ఏలేటి నర్సింహారెడ్డి, సాగర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి

జగిత్యాల, మార్చి 20: విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలు చేసి గొప్ప స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాలలో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2025, వన్ నేషన్-వన్ ఎలక్షన్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి విభాగంలో గెలుపోటములు సహజమని, ప్రతి విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కో ఆలోచన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు టీవీ సూర్యం, ప్రిన్సిపాల్ అశోక్, నాయకులు గిరి నాగభూషణం, అడువాల లక్ష్మణ్, రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ తోట మల్లికార్జున్, చెట్‌పల్లి సుధాకర్, శరత్ రావు, రంగు మహేశ్, ప్రవీణ్ రావు, క్రాంతి పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి పుష్పయాగం

ధర్మపురి, మార్చి 20: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వేంకటేశ్వర స్వామి పుష్పయాగం, యోగ నరసింహస్వామి ఏకాంతోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులు క్యూలైన్ల ద్వారా స్వామి వారలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు ఎదులాపురం మహేందర్, బాదినేని వెంకటేశ్, బొల్లారపు పోచన్న, గుడ్ల రవీందర్, కొమురెల్లి పవన్‌కుమార్, మందుల మల్లేశ్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, సంబెట తిరుపతి, స్తంభంకాడి గణేశ్‌కుమార్, వొజ్జల సౌజన్య, గంగాధర్, దేవస్థానం ఉప ప్రధాన అర్చకుడు నేరెల్ల శ్రీనివాసాచార్య, వేద పండితుడు రమేశ్‌శర్మ, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మార్చి 20: పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో గురువారం చోరీ జరిగినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన కటుకం సరోజన బుధవారం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. గురువారం వచ్చి చూడగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి బీరువా తెరిచి చూడగా అందులో భద్రపరిచిన అర తులం బంగారం, 10 తులాల వెండి కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ముగిసిన ఇంటర్ 'ద్వితీయ' పరీక్షలు

జగిత్యాల టౌన్, మార్చి 20: ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విద్యార్థులకు పరీక్షలు గురువారంతో ముగిసినట్లు జిల్లా ఇంటర్ పరీక్షల కన్వీనర్ నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. రసాయన శాస్త్రం, వాణిజ్యశాస్త్రం, ఒకేషనల్ బ్రిడ్జి కోర్సు పరీక్షల్లో 5984 మంది విద్యార్థులకు గానూ 5848 మంది హాజరు కాగా, 136 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మేడిపల్లి, మార్చి 20: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, జీర్ణ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంగడి ఆనంద్ కుమార్ సూచించారు. భీమారం, మన్నెగూడెంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు జీర్ణ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంగడి ఆనంద్‌కుమార్ పరీక్ష సామగ్రిని టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. గోవిందారం జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దాక్షాయిని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మాజీ సర్పంచ్ కరండ్ల మధుకర్ చేతుల మీదుగా పరీక్ష సామగ్రి అందజేశారు. దమ్మన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో చేపూరి నాగరాజు పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు.

పసుపు క్వింటాల్ @ రూ.12,001

మెట్‌పల్లి, మార్చి 20: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం పసుపు కొమ్ము(కాడి) క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.12,001, కనిష్ఠంగా రూ.7,979, పసుపు మండ (గోళ) గరిష్ఠంగా రూ. 10,651, కనిష్ఠంగా రూ.8 వేలు, పసుపు చూర గరిష్ఠంగా రూ.10,519, కనిష్ఠంగా రూ. 7,039 పలికింది. ఒక్క రోజు 2279 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు మార్కెట్‌లో 29359 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

ఇంటి పన్ను చెల్లించాలి

మెట్‌పల్లి టౌన్, మార్చి 20: ప్రజలు ఇంటి పన్ను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెలాఖరు లోగా ఇంటి పన్ను చెల్లించాలన్నారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలన్నారు. అలాగే, ఎల్ఆర్ఎస్ ఫీజు రూ. వెయ్యి చెల్లించిన వారు ఈనెల 31లోగా పూర్తి రుసుం చెల్లిస్తే 25 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

జగిత్యాల టౌన్/ఇబ్రహీంపట్నం, మార్చి 20: జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో పిచ్చుకలకు నీటి వసతి, బర్డ్‌ఫీడర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి విద్యార్థులకు పిచ్చుకల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధా రాణి, విశాల్, నర్మద, రాణి, జోత్స్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

కోరుట్ల, మార్చి 20: పట్టణ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ సూచించారు. పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆయన పరిసరాల పరిశుభ్రత, తడి, పొడి, హానికరమైన చెత్త సేకరణపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, మున్సిపల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీరు మహేశ్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

బాటసారుల దాహం తీర్చేందుకే చలి వేంద్రాల ఏర్పాటు

కోరుట్ల, మార్చి 20: బాటసారుల దాహం తీర్చేందుకే చలి వేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రామ కృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం సమీపంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ సురేశ్, ఏఈ అరుణ్‌కుమార్, మున్సిపల్ మేనేజర్ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెగడపల్లిలో వృద్ధుడి ఆత్మహత్య

పెగడపల్లి, మార్చి 20: పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన కొత్తూరి రాజయ్య (60) గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు. జీవనోపాధి కోసం కరీంనగర్‌లో ఉండే రాజయ్య రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అనారోగ్యానికి తోడు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ముందుగా గొడ్డలితో గాయపర్చుకొని, అనంతరం ఇంట్లో దూలానికి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. రాజయ్య కొడుకు విద్యాసాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మనుమయ సంఘం కార్యవర్గం

మెట్‌పల్లి, మార్చి 20: మెట్‌పల్లి పట్టణ విశ్వబ్రాహ్మణ (మనుమయ) సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొండ మురళి, ప్రధాన కార్యదర్శిగా ఇంద్రాల ఈశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజేంద్రభీష్మ, అశోక్, వెంకట స్వామి, తదితరులు పాల్గొన్నారు.

గుండంపల్లిలో పశువైద్య శిబిరం

మల్లాపూర్, మార్చి 20: మండలంలోని గుండంపల్లి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంతడ్పుల పుష్పలత, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఇట్టెడి నారాయణ రెడ్డి, పశువైద్యాధికారి అశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేందర్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో ఇఫ్తార్ విందు

ధర్మపురి, మార్చ్ 20: ధర్మపురి ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు అయ్యోరి రాజేశ్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ధర్మపురి మైనార్టీ పాఠశాల విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నాయకులు సయ్యద్ యూనస్, శ్రీనివాస్, బాలరాజు, జహంగీర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కోరుట్ల, మార్చి 20: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి ఐసీడీఎస్ అధికారి మణెమ్మ సూచించారు. పట్టణంలోని రహమత్‌పుర-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

జగిత్యాల రూరల్, మార్చి 20: చల్‌గల్‌లో మాదిగ యువజన సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను సంఘం పెద్దలు గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఇక్కడ భూమయ్య, టీ భూమయ్య, గంగాధర్, తదితరులున్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు ప్రారంభం

ధర్మపురి/జగిత్యాల టౌన్/ ఇబ్రహీంపట్నం/ మేడిపల్లి/ వెల్గటూర్/ పెగడపల్లి, మార్చి 20: జిల్లాలో శుక్రవారం నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు డీఈవో రాము తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 67 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఏ, బీ, సీ కేటగిరిలుగా విభజించినట్లు పేర్కొన్నారు. ఏ-కేటగిరిలో 25, బీ-కేటగిరిలో 20, సీ-కేటగిరిలో 22 కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిలో 65 కేంద్రాలను రెగ్యులర్ విద్యార్థులకు, మిగిలిన 2 కేంద్రాలు రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులకు కేటాయించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత, ప్రైవేట్ పాఠశాలలతో కలిపి మొత్తం 337 పాఠశాలల్లో 11,855 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు 67 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 67 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 28 మంది వెహికిల్ ఇన్‌చార్జులు, 826 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనుండగా, భౌతిక శాస్త్రం, జీవశాస్త్రం పరీక్షలు ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు సీఎస్‌లకు, డీవోలకు శిక్షణ ఇచ్చినట్లు డీఈవో రాము, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గంగాధర్ తెలిపారు.

హరిత సేనలో భాగస్వాములవ్వాలి

ధర్మపురి, మార్చి 20: రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ చేపట్టిన హరిత సేనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని హరిత సేన రాష్ట్ర ఇన్‌చార్జి గర్రెపెల్లి సతీశ్, ప్రొఫెసర్ శ్రీనివాస్ కోరారు. ధర్మపురి పట్టణంలోని ఓ మినీ ఫంక్షన్ హాల్లో గురువారం సమావేశం నిర్వహించారు. హరిత సేన ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జిగా సింగారపు మల్లిక్‌తేజను నియమించారు. అలాగే, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఇన్‌చార్జులను నియమించారు. అనంతరం ఫంక్షన్ హాల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హరిత సేన మండల ఇన్‌చార్జులు గోవిందుల జలపతి, దసర్తి పూర్ణచందర్, గొల్ల మల్లేశ్, అజిత్, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

జగిత్యాల, మార్చి 20: జిల్లా కేంద్రంలోని మండలేశ్వర స్వామి ఆలయ సమీపంలో గోగికార్ రాములు, గొడికె శంకర్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోగికార్ మహేందర్, గోలి శ్రీనివాస్, పంబాల రాము, భూమన్న, సీపెల్లి రవీందర్, సుధాకర్, కిశోర్ సింగ్, రాజు(లింబాజీ), భరత్, అజయ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి

కోరుట్ల, మార్చి 20: విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని జిల్లా విద్యాధికారి రాము సూచించారు. పట్టణంలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో వసతులు, ఫర్నీచర్, తాగునీటి సదుపాయం, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కోరుట్ల అర్బన్, మండలంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 1540 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. డీఈవో వెంట ఎంఈవో నరేశం, తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★శ్రీ ఆగస్త్య విద్యాసంస్థలో పనిచేయుటకు టీచర్